క్లుప్తంగా

ప్రజలకు కాసు మహేష్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి



దాచేపల్లి: చిన్నారులు క్రీస్తు మార్గంలో పయనించాలని కల్వరి చిల్డ్రన్ మినిస్ట్రీస్ నిర్వాహకులు కె.రమేష్ అన్నారు. స్థానిక విజయభాస్కర్ కల్యాణ మండపంలో గురజాల నియోజకవర్గ స్థాయిలో సండేస్కూల్ చిల్డ్రన్ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. సండేస్కూల్ చిన్నారులకు బైబిల్ చదవటం, పాటలు పాడటంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నేర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ..క్రీస్తు మార్గంలో పయనించటం వలన చెడు వ్యవసనాలకు దూరంగా ఉంటామన్నారు. చిన్న నాటి నుంచే ఏసుక్రీస్తు బోధనల ప్రకారం నడుచుకోవాలని, క్రీస్తుని నమ్మి విశ్వసిస్తే పరలోక రాజ్యంలో చేరుతామని ఆయన చెప్పారు. అనంతరం సండేస్కూల్ చిన్నారులకు ఆత్మీయ ప్రేమవిందు ఏర్పాటు చేశారు. రాజేష్ బృందం సభ్యులు సంగీత సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘస్థులు పాల్గొన్నారు.

శివస్వాములకు సద్ది వితరణ



గురజాల: పట్టణంలో వేంచేసియున్న మహిమానిత్వ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దేవాలయంలో శివస్వాములకు వివిధ మాలదారులకు సద్ది కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించారు. కార్యక్రమాన్ని వైద్యుడు పులుకూరి శివన్నారాయణ, కౌన్సిలర్ బొల్లయ్య, టీడీపీ నాయకులు శరమాళ్ల హనుమంతరావు, నెల్లూరి మల్లయ్యలు ప్రారంభించారు. ముందుగా దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సద్ది కార్యక్రమం 45 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని స్వాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



పిడుగురాళ్ల: పట్టణంలోని సుందరయ్య కాలనీలో సంక్రాంతి పండగ సందర్భంగా సీఐటీయూ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.దుర్గాబాయి మాట్లాడుతూ సుందరయ్య కాలనీ వాసులందరు సంక్రాంతి పర్వదినాన్ని నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో వివిధ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సీఐటీయూ నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకులు నాగమ్మబాయ్, తెలకపల్లి కృష్ణవేణి, జనగాం రమణ, లక్ష్మీ, సుందరయ్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం నుంచి 16వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు సోమవారం తెలిపారు. గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా భోగి వేడుకలు

- తెలతెలవారకముందే ప్రతి వీధిలో భోగి మంటలు
- చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వచనాలు



మాచవరంలో భోగి మంట వద్ద మహిళల సందడి

రెంటచింతల: అగ్ని దేవునికి ఆరాధనే భోగి మంటలని పురాణాల ద్వారా తెలుస్తుందని మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు వడ్డమాను రమణాచార్యులు అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో తెల్లవారుజామున ఇళ్లముందు పిల్లలు, యువకులు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసి భోగి మంటలు వేశారు. నివాసాల ముందు రంగురంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి రేగిపండ్లు, పూలతో అందంగా అలంకరించారు. కుటుంబాలలో చిన్నారులపై రేగిపండ్లు, పూలతో దీవించారు.

మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

మాచర్ల: మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ జిల్లా డెప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, అసిస్టెంట్ గవర్నర్ కిక్కుర్తి శంకరలు, కొండవీటి కృష్ణకుమారిలు సంక్రాంతి సంబరాల ప్రత్యేకతలను వివరించారు. కోడిపుంజు పందేలు, గాలిపటాలు, బొంగరాలు తదితర సంప్రదాయ ఆటలు ఆడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంప్రదాయ వంటలు ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ సెక్రటరీ నిమ్మకాయల సురేఖ, కర్నాటి, పి.శ్రీనివాసరావు, గుండా నాగేశ్వరరావు, కోశాధికారి ఎ.లక్ష్మి, సీనియర్ రొటేరియన్లు డాక్టర్ భవానీ, పఠాన్‌నాగూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో...

మాచర్ల: పట్టణంలో ప్రజలు సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేసి సందడి చేశారు. రామాటాకీస్, రైల్వే స్టేషన్, చెన్నకేశవ స్వామి దేవాలయం, రింగ్‌రోడ్డు, సాగర్‌రోడ్డు, శ్రీశైలం రోడ్డుల్లో స్థానికులు భోగి మంటలు వేసి సంబరాలు చేశారు. చలికాసుకుంటూ భోగిమంటల వద్ద సందడి చేశారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: భోగి వేడుకలు పట్టణ ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే లేచి తమ వీధులు, అపార్టుమెంట్ ప్రాంతాల్లో భోగి మంటలను వేసి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.



రామాటాకీస్ వీధిలో భోగిమంట వేసిన దృశ్యం



పాలువాయి గ్రామంలో ..



భోగి మంట వేస్తున్న మాచర్ల రోటరీ క్లబ్ సభ్యులు



చిన్నారులకు రేగిపండ్లు, పూలతో దీవెనలు

వీపీ సౌత్‌లో...

విజయపురిసౌత్: భోగి పండుగ వేడుకలు విజయపురిసౌత్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. పలు కూడళ్లలో తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. గృహాలలో చిన్నారులపై భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు.

ఘనంగా భోగి వేడుకలు

గురజాల: తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి. సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో మొదటి రోజు భోగి పండుగను ప్రజలు ఎంతో ఘనంగా సోమవారం జరుపుకొన్నారు. వేకువజాము నుంచి ప్రజలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గులపై గొబ్బెమ్మలు ఉంచి భోగి మంటలు వేశారు. సాయంత్రం సమయంలో చిన్నారులకు భోగి పండ్లు పోసారు.

గ్రామాల్లో హరిదాసుల కోలాహలం..

మండల పరిధిలోని జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు తదితర గ్రామాల్లో హరిదాసులు కోలాహలం కనిపించింది. హరిదాసులు, గంగిరెద్దు బసవన్నలు, కాటికాపర్లు గ్రామాల్లో సందడి చేశారు. వేకువ జాము నుంచే గ్రామాల్లో హరిలో రంగ హరి అంటూ హరిదాసులు, బసవన్న ఆట పాటలతో గ్రామాలు సందడిగా మారాయి. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి హరిదాసులు, గంగిరెద్దు బసవన్నలు వెళ్లారు.

మాచవరంలో...

మాచవరం: మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నారులకు రేగిపళ్లు పోసి ఆశీర్వదించారు.

కిటకిటలాడిన దేవాలయాలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భోగి పండుగతో పాటు శివ కోటివారం కావడంతో శైవక్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురజాలలోని ముక్కంటేశ్వరస్వామి, అమర లింగేశ్వర స్వామి, పల్నాడు భద్రాదిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం, జంగమహేశ్వరపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయలు భక్తులతో కిటకిటలాడాయి.



అమరలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఊరెళితే.. జరభద్రం!

- అందుబాటులో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు
- పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే మేలు



పిడుగురాళ్ల: సంక్రాంతి పండుగకు చాలా మంది సొంత గ్రామాలకు వెళ్తున్నారు. అదే అదునుగా దొంగలు ఇళ్లలో చొరబడే ప్రమాదమున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలు వినియోగించుకుంటే మరింత మేలని చెబుతున్నారు. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి..

స్వగ్రామాలు, క్యాంపులు, దేవాలయాలకు వెళ్లే ముందు దగ్గరలోని సచివాలయ పోలీసులకు సమాచారం అందజేయాలి. ఎన్ని రోజులు బయటకు వెళతారో నన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. పోలీసులు ఆ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా భద్రత కల్పిస్తారు.

అప్రమత్తం చేస్తున్నాం..



ఊళ్లకు వెళ్లే ముందు సమాచారమిస్తే పోలీసు యాప్, ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో భాగంగా ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం, ఇంటి యజమాని మొబైల్ రూమ్‌కు జీపీఎస్ ద్వారా అనుసంధానిస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రజలకు అర్థమయ్యేలా వాహనాల ద్వారా ఇప్పటికే ప్రచారం నిర్వహించాం.

– శ్రీరాం వెంకట్రావు, పట్టణ సీఐ, పిడుగురాళ్ల

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

వెల్దుర్తి: మండలంలోని 16 పంచాయితీలలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలలో డంపింగ్ యార్డులు నిర్మించి వాటి ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు ప్రభుత్వం క్లాప్ మిత్రాలను నియమించింది. గ్రామాలలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తలను సేకరించి ఆ చెత్తను రిక్షాల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలనుకున్నారు. కానీ పంచాయతీలలో నిధులు లేకపోవటం వలన తడి, పొడి చెత్తలను సేకరించేవారికి జీతాలు సక్రమంగా ఇవ్వకపోవటంతో వారు పనులను మానివేశారు. 2018 సంవత్సరంలో ఒక్కో డంపింగ్ యార్డుకు రూ. 10లక్షల చొప్పున నిధులు వెచ్చించి నిర్మించారు. అయితే మండలంలోని కండ్లకుంట డంపింగ్ యార్డులో మాత్రమే తడి, పొడి చెత్తలను సేకరించి వర్మకంపోస్టు తయారు చేశారు. మిగతా డంపింగ్ యార్డులో కార్యకలాపాలు నిర్వహించలేదు. ప్రతి గ్రామ పంచాయితీలో ఊరి చివర డంపింగ్ యార్డులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



కండ్లకుంటలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

వాడుకలోకి తీసుకురావాలి..



ప్రభుత్వం రైతులకు ఉచితంగానే వర్మీకం పోస్టును అందించేందుకు డంపింగ్ యార్డులను నిర్మించింది. గ్రామాల నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి దానిని రిక్షాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలి. ఏ ఒక్క డంపింగ్ యార్డులోనూ వర్మీకంపోస్టు తయారు చేయటం లేదు. డంపింగ్ యార్డులలో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు అందించాలి.

– గార్లపాటి వెంకట్రామయ్య, రైతు, రచ్చమల్లపాడు

ఘనంగా గోదాదేవి కల్యాణ మహోత్సవాలు



గోదాదేవి సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



నారాయణపురంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రెంటచింతల: ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలో వేంచేసిన శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు నేతృత్వంలో వేదపండితులు జిగురు చంద్రశేఖర్ శర్మ, జిగురు శంకర్‌శర్మ స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు వివిధ రకాల అభిషేకాలు, ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్యవెంకటరామిరెడ్డి దంపతుల సమక్షంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. దేవస్థానాన్ని విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రాంబాబు, సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన లడ్డూ వేలంలో రెంటచింతలకు చెందిన వీరమల్ల రమేష్ రూ.18,116లకు దక్కించుకున్నారు.

దాచేపల్లి: గోదాదేవి కల్యాణ క్రతువు సోమవారం కనుల పండువలా జరిగింది. నారాయణపురంలోని రామాలయాల్లో గోదాదేవి కల్యాణం జరిపించారు. శ్రీ సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో నారాయణపురంలోని యోగా విజ్ఞానకేంద్రంలో గోదా రంగనాయక స్వామి కల్యాణం జరిపించారు. పలువురు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాచేపల్లితో పాటుగా కేసానుపల్లి, తంగెడ, ముత్యాలంపాడు, తంగెడ, మాదినపాడు, శ్రీనగర్, రామాపురం గ్రామాల్లో గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది. మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

మాచర్లలో...

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి, గోదాదేవిలను ప్రత్యేకంగా అలంకరణ చేసి నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అడిగొప్పల చెన్నకేశవచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు బోయరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, మెట్టు కృష్ణల ఆధ్వర్యంలో కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదా సహిత రంగనాథ స్వామి కల్యాణ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మాచవరంలో...

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో శ్రీ కృష్ణ సమేత గోదాదేవి అమ్మవారి కల్యాణ వేడుకలు మాచవరం ఆర్యవైశ్య కల్యాణ మండలంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

నగర సంకీర్తన..



మాచర్ల పట్టణ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

మాచర్ల: పట్టణంలోని దేవాలయాల్లో ధనుర్మాసం పురస్కరించుకుని మహిళలు వేంకటేశ్వర స్వామి చిత్రపటంతో నగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి నగర సంకీర్తన జరిపారు. బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామిదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగిరెద్దులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

రంగస్థల కళాకారులకు సన్మానం

అమరావతి: శాస్త్రీయ సంగీత పరిజ్ఞానంతో నాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కళాకారుడు శక్తి వంచన లేకుండా కషి చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరావటం రామకృష్ణ అన్నారు. సోమవారం భోగి పండగ సందర్భంగా నాట్య మండలి కార్యాలయంలో కళాకారుల సన్మాన సభ నిర్వహించారు. రంగస్థల నటులు జాస్తి సత్యమూర్తి, సాయి నటరాజ నాట్యమండలి వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు చిక్కాల ఉదయశేఖర్, హార్మోనిస్టు గుంటూరు రాజును ఘనంగా సన్మానించారు. సమాజాన్ని మేల్కొలిపే ప్రక్రియలో భాగంగా వినోదం, వికాసం, విజ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలంటే కళలకు, కళాకారులకు సమాజం ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా రామకృష్ణ కోరారు.